క్లుప్తంగా

నేడు మాంసం విక్రయాల నిషేధం

చిత్తూరు అర్బన్: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం విక్రయాలు జరపరాదని నగర కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని మాంసం విక్రయదారులు, హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళిమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు అందుకున్న విద్యార్థులతో పూర్వవిద్యార్థులు

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఉదయం పాఠశాలలో 190 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారికి అదే పాఠశాలలో 1984లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాల హెచ్ఎం గిరిరాజా ఆధ్వర్యంలో ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు త్రివేణి, తులసీప్రసాద్, విజయకుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలను పెంచాలి

చిత్తూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతనాలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు మండలంలోని కుర్చివేడులో ఆదివారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ జాబ్‌కార్డులను వ్యక్తిగతంగా ఇవ్వాలన్నారు. ఒక్కొక్కరికి 200 పనిదినాలు కల్పించాలన్నారు. భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయాలన్నారు. గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, జాయ్స్, అముద, బుజ్జి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

తవణంపల్లె: ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యమని అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సరకల్లులో తమ స్వంత నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సరకల్లు సర్పంచ్ సతీష్‌రెడ్డి సమక్షంలో దాత పైమాఘం సుగుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, పైమాఘం సుగుణాకర్ రెడ్డి సత్యమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం దాత సుగుణాకర్ రెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వాటర్ నిల్వ చేసే మిషన్లను స్విచ్ ఆన్ చేసి ప్రజలకు ఉచితంగా స్వచ్ఛమైన తాగు నీటిని అందించారు. పూతలపట్టు నియోజకవర్గంలో సొంత నిధులతో 12 వాటర్ ప్లాంట్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కత్తి సుధాకర్ రెడ్డి, బాబురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

‘స్వచ్ఛ’మేవ జయతే

- పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం
- అందరి సహకారంతోనే సాధ్యం
- స్వచ్ఛతాహి సేవలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించగలమని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ జె.అరుణ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా, ‘పరిశుభ్రత కోసం ఒక గంట శ్రమదానం’ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ అరుణ ఆదివారం నగరపాలక సంస్థ బస్టాండ్ వద్దనున్న మార్కెట్ రోడ్లను చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిశుభ్రత అంశాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. గృహాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఊరు శుభ్రంగా ఉంటుందని, తద్వారా ప్రజలు ఆరోగ్యకర జీవనం సాగించేందుకు వీలవుతుందని తెలిపారు. ఇందు కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తుంటారని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షన్ని షర్మిల, ఎంహెచ్ఓ లోకేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డుల్లోనూ స్థానిక కార్పొరేటర్ల భాగస్వామ్యంతో వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు ×పరిశుభ్రత కోసం ఒక గంట శ్రమదానం్జ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో శుభ్రం చేయడంతో పాటు, గతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రంగా మార్చడంతో పాటు మొక్కలు నాటారు. పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత

చిత్తూరు కలెక్టరేట్: పరిసరాల శుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం హసన్‌బాషా అన్నారు. ఆదివారం పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే అంటురోగాలు దూరమవుతాయన్నారు. పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు నగరంలోని గాంధీజీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను శుభ్రం చేశారు. కొత్త బస్టాండ్ వద్ద పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 35 ఆంధ్రాబెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌బస్‌నెట్, ఛత్రి, ఎన్‌సీసీ ఆఫీసర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో..

నగరంలోని తపోవనం వృద్ధాశ్రమంలో సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాల విద్యార్థులు స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాల విద్యార్థులు వృద్ధాశ్రమం పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించారు. పాఠశాల మేనేజర్ సుమిత్, టీచర్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



ఐరాలలో స్వచ్ఛతాహి సేవ

విజయవంతంగా స్వచ్ఛతా హి సేవ

పూతలపట్టు: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులు తమ వీధిలోని చెత్త, మట్టిని తొలగించి శ్రమదానం చేశారు. అలాగే ఆకనంబట్టు గ్రామ పంచాయతీలో గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానలో పాల్గొన్నారు. పూతలపట్టు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు ప్రాజెక్ట్ ఆఫీసర్ నిర్మల ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలను నాటి నీళ్ల పోశారు. వసతి గృహాధికారి జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల పాల్గొన్నారు.



చిత్తూరు: స్వచ్ఛతా హి సేవలో ప్రభుత్వ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఐరాల: కాణిపాకం పంచాయతీలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అగరంపల్లె టోల్‌గేట్ నుంచి కాణిపాకం ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళ సంఘ సభ్యులతో కలిసి శ్రమదానం చేశారు. కాణిపాకం కూడలి వద్ద పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. స్వచ్ఛ కాణిపాకం కోసం కృషి చేద్దామని కోరారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సత్యంరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వివేక్, షణ్ముగం పాల్గొన్నారు.





చిత్తూరు కూరగాయల మార్కెట్ పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేస్తున్న కమిషనర్ అరుణ, వృద్ధాశ్రమంలో చెత్తను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన బృందావన్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి వెల్లడించారు. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెట్‌బాల్ జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో తమ విద్యార్థులు చరణ్, ధోని, సాయి సంతోష్, గణేష్, మోహిత్, రెడ్డికృష్ణ, కీర్తి శ్రీ,హరిణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.

వినాయకుని సేవలో ఉత్తరాది పీఠాధిపతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఉత్తరప్రదేశ్ మత్తుర ఉత్తరాధి పీఠాధిపతులు అథోక్షజనంద్ దేహతీర్థ్‌జీ మహారాజ్ దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం పీఠాధిపతులు తన బృందంతో ఆదివారం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.



పీఠాధిపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు



బీఎస్‌ఆర్‌పేట పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిత్తూరు రూరల్: మండలంలోని బీఎస్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు రూ. 50 వేలు విలువ చేసే కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాబర్ట్, పీసీ బాబు, రంజన్, బాబుబాషా, శేషాద్రి, చంద్ర, వేణు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో ఎమ్మెల్యే ఆరణి



వినాయకుడికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: మండల పరిధిలోని పచ్చనపల్లిలో ఆదివారం వినాయకున్ని కొలువుదీర్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వామివారికి తొలిపూజ చేశారు. కర్పూర హారతులు ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు సంపత్, స్టాండ్లీ, దిలీప్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

తలుపుతట్టిన పింఛన్..!

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో ఆదివారం సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. వేకువజాము నుంచే పింఛన్ల అందించే కార్యక్రమం మొదలైంది. వలంటీర్లు లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్ సొమ్మును అందించారు. సాయంత్రానికి 81.83 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని బెంగళూరుకు చెందిన శాస్విక్ కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం మధ్యాహ్నం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: నగరంలోని సంతపేటలో ఆదివారం జేఎంసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని ప్రజలకు శుద్ధనీరు అందించాలనే ఉద్దేశంతో తమవంతుగా జేఎంసీ ట్రస్టు ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానజగదీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

నడుం: మండలంలోని ఉప్పరపల్లెలో ఏనుగులు శనివారం రాత్రి పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. గుంపు నుంచి విడిపోయిన మూడు ఏనుగులు బాలకృష్ణ, ఈశ్వరయ్య, రెడ్డెమ్మ, మోహన్‌కు చెందిన వరి, చెరుకు తోటలతో పాటు మరో పది మంది రైతులకు చెందిన పంటలను నాశనం చేసినట్లు చెప్పారు. గ్రామ సమీపానికి ఏనుగులు రావడంతో తీవ్ర ఆందోళన చెందామని, ఏనుగుల బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు.



దెబ్బతిన్న వరి పంట

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



యాదమరి: ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, అధికారులు



గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

యాదమరి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి తెలిపారు. ఆదివారం యాదమరి మెయిన్ బజారులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో గ్రామీణ ప్రజలకు పరిశరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో జెడ్పీ వైస్ చైర్మన్, అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. చివరగా గ్రామాలలో చెత్తను తొలగించే గ్రీన్ అంబాసిడర్‌లను ఘనంగా సన్మానించారు. జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, యాదమరి ఎంపీడీఓ శివరాజ్, ఈఓపీఆర్డీ హరిప్రసాద్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం

బంగారుపాళెం: జనాభా ప్రాతిపదికన బీసీలకు రావాల్సిన వాటాలను అన్నింటిలోనూ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్ అన్నారు. బంగారుపాళెంలో ఆదివారం నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం సంతోషమన్నారు.

నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎంపిక: జాతీయ బీసీ సంక్షేమ సంఘం పూతలపట్టు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా కోదండ, ఉపాధ్యక్షుడిగా మురళి, ప్రచార కమిటీ అధ్యక్షుడిగా ఉదయకిరణ్ నియమితులయ్యారు. అనంతరం నూతన కార్యకర్గ సభ్యులను సన్మానించారు. పూతలపట్టు, ఐరాల మండల అధ్యక్షులు రమేష్, రమణ, బీసీ నేతలు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీప్రసన్నకుమార్

సీనియర్ సిటిజన్లకు సన్మానం



సీనియర్ సిటిజన్లను సన్మానించిన అధికారులు

పూతలపట్టు: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్లను రెవెన్యూ అధికారులు సన్మానించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని మండల ఎన్నికల డీటీ మహేశ్వరి నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు గౌసబాషా, రామలింగారెడ్డి, సుబ్రమణ్యం, రామ్మూర్తిరెడ్డి, జోసఫ్‌లను సన్మానించారు. డీటీ కవిత, కోఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

తవణంపల్లె: తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సీనియర్ సిటిజన్ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, భూరీసర్వే డీటీ వెంకటరమణ, వీఆర్‌ఓలు సీనియర్ సిటిజన్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు.



వృద్ధులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఘనంగా వృద్ధుల దినోత్సవం

చిత్తూరు రూరల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలతో సత్కరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ మురళీమోహన్ పిలుపునిచ్చారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, గాయకులు భక్తి గీతాలు, భాగవతారిని హరికథా కాలక్షేపం నిర్వహించారు. కళాకారులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రశంసాపత్రాలు అందించారు. –కాణిపాకం



కళాకారులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ



కుండపై నాట్యం చేస్తున్న కళాకారిణి



భరతనాట్యం చేస్తున్న కళాకారులు



శ్రీకృష్ణార్జున యుద్ధం నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు